

సిద్దిపేటలో



బంకుల వద్ద బారులు

హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి కేంద్రం తీసుకొచ్చిన నిబంధనలను నిరసిస్తూ లారీ, ట్రక్కు డ్రైవర్లు మూడురోజుల పాటు సమ్మెకు పిలుపునిచ్చారని తెలియడంతో సిద్దిపేట జిల్లాలో మంగళవారం వాహనదారులు పెద్దఎత్తున ఆయా పెట్రోల్‌బంకుల వద్ద క్యూకట్టారు. కొందరు క్యాన్లు, బాటిళ్లలో మూడురోజులకు సరిపడా తీసుకెళ్లారు. జిల్లాలోని ప్రతి పెట్రోల్ బంకు కిటకిటలాడింది. ఒక్కరోజులో అమ్ముడయ్యే 3వేల నుంచి 4వేల పెట్రోల్, డీజిల్ ఒకగంటలో అయిపోవడం గమనార్హం.

– సిద్దిపేట అర్బన్/ గజ్వేల్/ హుస్నాబాద్, జనవరి 2

సిద్దిపేటలోని ఓ పెట్రోల్‌బంకు వద్ద వాహనదారులు



అహ్మదీపూర్ పెట్రోల్‌బంక్ వద్ద అంబులెన్స్





సిద్దిపేటలో క్యాన్లు, బాటిళ్లలో పెట్రోల్‌ను తీసుకెళ్తున్న దృశ్యం



సిద్దిపేటలో పెట్రోల్ కోసం క్యూలో నిల్చున్న మహిళ, చిన్నారి



హుస్నాబాద్‌లో పెట్రోల్ కోసం బారులు తీరిన వాహనదారులు

5లోగా మల్లన్న కల్యాణ ఏర్పాట్లు పూర్తవ్వాలి

- సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్
- కల్యాణ మహోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణ
- క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనుల్లో జాప్యంపై ఆగ్రహం

7లో



క్యూలైన్లను పరిశీలించి పలు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా

- ప్రజల భద్రతకు పెద్దపీట వేయాలి
- సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాస్

సిద్దిపేట క్రైం, జనవరి 2 : గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి నూతన సంవత్సరం సందర్భంగా అడిషనల్ డీసీపీ అడ్మిన్ కేక్ కట్ చేసి పోలీస్ అధికారులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొత్త ఆశయాలతో ప్రతిఒక్కరూ ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించారు. రాబోవు ఎన్నికల్లో కూడా ఇలానే సమిష్టిగా పనిచేసే జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజల భద్రత చాలా ముఖ్యమని తెలిపారు. ప్రజల రక్షణకు అవసరమైన ప్రదేశాలలో బ్లూ కోల్ట్స్, పెట్రోల్ కార్ సేవలు మరింత పెంచాలని సూచించారు. టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలి.. ఏఏ సందర్భాల్లో ఉపయోగించుకోవాలి తదితర అంశాల గురించి సూచించారు. కార్యక్రమంలో ఏసీపీలు రమేష్, సతీష్, సురేందర్ రెడ్డి, ప్రసన్న కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, సీఐలు ఇన్‌స్పెక్టర్లు, ఏవో యాదమ్మ, సూపరింటెండెంట్లు ఎస్.కె జమీల్ పాషా, ఫియాజుద్దీన్, అబ్దుల్ ఆజాద్, కమిషనరేట్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్

జోరుగా మట్టిదందా



మల్లనసాగర్ కాలువ పక్కన మట్టి నిలువలు

- మాయమవుతున్న మల్లన్నసాగర్ కాలువ మట్టి
- వెంచర్లకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్న అక్రమార్కులు

కొండపాక, జనవరి 2 : కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో అక్రమంగా మట్టిదందా సాగుతున్నది. రాజీవ్ రహదారికి ఆనుకుని కుకునూర్‌పల్లి, లకుడారం గజ్వేల్, దుద్దెడ తదితర ప్రాంతాల్లో వెంచర్లు వెలిశాయి. కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ప్లాట్ల వరకు రోడ్డు వేయడానికి మట్టిని కొనుగోలు చేస్తున్నారు. మల్లన్నసాగర్ కాల్వ నిర్మాణ సమయంలో గుట్టలకొద్ది మట్టికాలువలకు ఇరువైపులా నిలువ ఉంచారు. కొందరు ఆ మట్టిని తరలిస్తూ కాసులు దండుకుంటున్నారు. అయితే ఇదంతా ఎలాంటి అనుమతులూ లేకుండా చేయడం గమనార్హం. ఈ దందా రాజీవ్ రహదారిపై నుంచి సాగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కుకునూరుపల్లి మండలం పరిధిలోని తిప్పారం, మేదినీపూర్, కుకునూర్‌పల్లి, లకుడారం శివారులోని మల్లన్నసాగర్ కాలువ నుంచి రోజు టిప్పర్ల కొద్ది మట్టి తరలిస్తున్నారు. కాలువ పనుల్లో నిలువ ఉంచిన గుట్టలకొద్ది మట్టి క్రమంగా మాయమవుతున్నది. భవిష్యత్‌లో ప్రభుత్వ అవసరాలకు మట్టి దొరక్క ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి లేకపోలేదు.



తిప్పారం శివారులోని మల్లన్నసాగర్ కాలువ మట్టిని తరలిస్తున్న దృశ్యం

సెలవు రోజుల్లో, రాత్రిళ్లు తరలింపు

మట్టిదందా బయటకు తెలియకుండా సెలవురోజుల్లో, రాత్రి సమయాల్లో టిప్పర్లతో రోజూ వందలాది ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారు. ఎవరికంటా పడకుండా ఉండేందుకు టిపర్ల డ్రైవర్లు వేగంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో రాత్రిళ్లు ప్రయాణించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కిలోమీటర్ వరకు టిప్పర్లు రాంగ్ రూట్లో వెళ్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వాహనదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మూతబడి

- విద్యార్థులు రాక ప్రభుత్వ పాఠశాలలకు తాళం



సంగారెడ్డి మండలం అంగడిపేటలో మూతపడిన ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల

సంగారెడ్డి అర్బన్, జనవరి 2 : ప్రభుత్వ బడికి వెళ్లేందుకు ఆ ప్రాంతాల్లో విద్యార్థులే లేరా? ఉన్నా ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారా? లేక సర్కారు బడిలో చేర్పించేలా బడిబాట సక్రమంగా నిర్వహించలేదా? సర్కారుబడికి వచ్చేలా ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది ప్రోత్సహించడం లేదా?... కారణాలేమైనా సంగారెడ్డి జిల్లాలో పదుల సంఖ్యలో సర్కారు బడులు మూతపడుతున్నాయి. జిల్లాలో 47 పాఠశాలల్లో విద్యార్థులు లేరంటే ఆశ్చర్యం కలగకమానదు. స్కూలుకు వచ్చే పిల్లలు లేక ఆయా పాఠశాలలకు తాళాలుపడ్డాయి. అక్కడ పనిచేసే ఉపాధ్యాయులను వేరే స్కూళ్లకు డిప్యూటేషన్‌పై పంపారు. జిల్లాలోని సంగారెడ్డి, హత్నూర, ఝరాసంగం, కల్హేర్, కోహీర్, కొండాపూర్, మనూర్, మునిపల్లి, నారాయణఖేడ్, నిజాంపేట, న్యాల్‌కల్, రాయికోడ్, సిర్గాపూర్, వట్‌పల్లి తదితర మండలాల్లో ఒక్కో మండలంలో ఒకటి నుంచి ఐదేసి స్కూళ్ల వరకు ఇలా మూతపడ్డాయి. ఇందులో ఎక్కువగా ప్రాథమిక పాఠశాలలే ఉన్నాయి. పదిహేను రోజుల కిందట జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో సంగారెడ్డి మండలం అంగడిపేటలోని ఉర్దూ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతపడింది. విద్యార్థులు రావడంలేదని ఏకంగా ఆ పాఠశాలలో పనిచేసే ఒకేఒక ఉపాధ్యాయుడు సంగారెడ్డి మండల విద్యాశాఖ అధికారికి లేఖ రాశారు. బడులు మూతపడడానికి విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. కాగా, రెండ్రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులు లేని బడంటూ ఉండకూడదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో విద్యార్థులు లేక మూతబడిన ఆయా పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు జిల్లా విద్యాశాఖ ఏం చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉన్నది.



హత్యాయత్నం కేసులో ఒకరికి రిమాండ్

జహీరాబాద్, జనవరి 2 : జహీరాబాద్ మండలంలోని సత్వార్ గ్రామంలో ఇద్దరు వ్యక్తులను చాకుతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తిని మంగళవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని పట్టణ సీఐ రాజు, ఎస్‌ఐ నరేష్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల 31న సత్వార్ గ్రామానికి చెందిన కల్పగూర్ నర్సింలు, బొమ్మె యోగేష్, బొమ్మె జనార్దన్, బీశ్ల గుండప్ప, బీశ్ల హరిక్రిష్ణ కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. బొమ్మె జనార్దన్ ఇంటి ముంగిట చలిమంట వేసుకుని కూర్చున్నారన్నారు. ఇంతలో ఏర్పుల నర్సింలు అక్కడికి వచ్చి చలిమంటపై దూకుతూ అక్కడ ఉన్న వారిని ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో బొమ్మె యోగేష్ ఎందుకిలా చేస్తున్నావంటూ ఏర్పుల నర్సింలును మందలిస్తున్న క్రమంలో అక్కడే ఉన్న కల్పగూర్ నర్సింలు విడిపించి సర్దిచెప్పి ఏర్పుల నర్సింలును ఇంటికి పంపిచాడు. అనంతరం ఏర్పుల నర్సింలు తన ఇంట్లో ఉన్న చాకుతో వచ్చి బొమ్మె యోగేష్‌తో మళ్లీ గొడవ పెట్టుకుని మెడపై, కాలుపై కత్తితో గాయాలు చేశాడు. మధ్యలో వచ్చిన కల్పగూర్ నర్సింలును కత్తితో పొడవడమే కాకుండా మెడపై, కడుపుపై నోటితో గాయపరిచి పారిపోయాడు. కల్పగూర్ నర్సింలు చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం హత్యాయత్నం చేసిన ఏర్పుల నర్సింలును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుచగా 14రోజులు రిమాండ్‌కు పంపించారు.

బిల్లులను విడుదల చేసి మధ్యాహ్న భోజన వంటకార్మికులను ఆదుకోవాలి

● ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య

చిన్నశంకరంపేట, జనవరి 2: గతేడాది సెప్టెంబరు నుంచి మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల చేయకపోవడంతో వంట కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బిల్లును విడుదల చేసి ఆదుకోవాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నశంకరంపేట విలేకర్ల సమావేశంలో ఎస్టీయూ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. వంట కార్మికులు అప్పు తెచ్చి వంటలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు చాలీచాలని వేతనాలకు వంటలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా స్కావేంజర్లను నియమించాలని డిమాండ్ చేశారు.

గృహిణి ఆత్మహత్యాయత్నం

సంగారెడ్డి క్రైం, జనవరి 2 : భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా గృహిణి మంగళవారం నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామానికి చెందిన జంగంగారి శిరీష(36) తన భర్త కృష్ణ మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం శిరీష మండల పరిధిలోని ఫసల్‌వాది వద్ద ఉన్న శివ్వంపేట బ్రిడ్జి నుంచి నదిలోకి దూకడానికి యత్నించింది. అదే సమయంలో అక్కడి నుంచి వెళ్తున్న సీడీసీ డైరెక్టర్ జైపాల్ నాయక్ గమనించి ఆమెను రక్షించారు. అనంతరం డీసీసీబీ ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం ఘటనా స్థలానికి చేరుకొని ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి ఇంటికి పంపించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుమ్మడిదల, జనవరి 2 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన అన్నారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 27న కానుకుంట కుమార్(40) భార్యతో గొడవ కారణంగా విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్ సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో కుమార్ మంగళవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు పెంటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జింకను కాపాడిన పోచారం గ్రామస్థులు

రేగోడు, జనవరి 2: మండలంలోని పోచారం సమీపంలో ప్రధాన రహదారిపై కృష్ణజింకను కుక్కలు వెంబడించి దాడి చేశాయి. అటుగా వెళుతున్న ప్రయాణికులు, గ్రామస్థులు కుక్కలను తరిమేసి జింకను పోచారం గ్రామానికి తీసుకొచ్చారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రాజయ్య కృష్ణజింకకు రేగోడు వెటర్నరీ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి కృష్ణజింకను అప్పగించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చిలప్‌చెడ్, జనవరి 2: ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ షేక్ మహమ్మద్ సూచించారు. మంగళవారం మండలం పరిధిలోని గౌతాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ఆదేశాను సారం కళాబృందంతో సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్, మూఢనమ్మకాలు తదితర అంశాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, హెడ్‌కానిస్టేబుల్ సురేందర్, హోమ్‌గార్డులు జనార్దన్, ఇసాక్, షీటీం బృందం తదితరులు పాల్గొన్నారు.

మాట నిలుపుకుంటాం.. అదే మా నైజం

- ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరించడానికే ప్రజాపాలన
- 100 కుటుంబాలకో కౌంటర్
- ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ


నారాయణఖేడ్ మండలం హన్మంత్‌రావుపేటలో ప్రజాపాలన ధరఖాస్తు స్వీకరిస్తున్న మంత్రి దామోదర్

నారాయణఖేడ్, జనవరి 2: ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్ నైజమని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. నారాయణఖేడ్ మండలం హన్మంత్‌రావుపేట, ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్‌లలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నమే చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఏ ప్రభుత్వ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా మీసేవ కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేదని విమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని సమస్యలు పరిష్కరించడానికే ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీ పథకాల అమలకు కార్యాచరణ ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేశామని, మిగిలినవాటికి ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించి అమలు చేస్తామన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 100 కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేయించామని మంత్రి తెలిపారు. జిల్లావ్యాప్తంగా మంగళవారం వరకు లక్ష దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. ప్రజాపాలన గ్రామసభలు ఈ నెల 6తో పూర్తయినప్పటికీ ఆ తరువాత కూడా అర్హులైనవారు మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయ వచ్చని తెలియజేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. నల్లవాగు ఆయకట్టు తైబంది నిర్వహించి సాగునీటిని విడుదల చేయాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. సమావేశాల్లో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, డీఎఫ్‌వో శ్రీధర్, టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి, ఆర్డీవో వెంకటేష్, ఎంపీపీ చాందీబాయి, సర్పంచ్‌లు దత్తు, సతీష్, ఎంపీటీసీ లక్ష్మి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనాబేగంనజీబ్, కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్ షెట్కార్, దారం శంకర్, వివేకానంద్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో వసతులు, పరికరాలు, సిబ్బంది నియామకానికి ప్రాధాన్యమిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను దశలవారీగా భర్తీ చేస్తామని తెలిపారు. నారాయణఖేడ్ ప్రాంతంలో వైద్య సేవలను విస్తరింప చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకుముందు తొలిసారి నారాయణఖేడ్‌కు వచ్చిన మంత్రికి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, జిల్లా కలెక్టర్ శరత్, ఏరియా వైద్యశాలల కోఆర్డినేటర్ సంగారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి గాయత్రిదేవి, వైద్య శాల సూపరిండెంట్ వెంకటలక్ష్మి, సేవాలాల్ సంఘం నాయకులు రమేష్ చౌహన్, తదితరులు ఉన్నారు.

ఉద్యమకారులకు అండగా ఉంటాం

- అమరుల కుటుంబాలను ఆదుకుంటాం
- ఇషాంత్‌రెడ్డి కుటుంబానికి ఇంటి స్థలం
- అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం
- ఇంటింటికి సంక్షేమ ఫలాలను అందజేస్తాం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

న్యాల్‌కల్, జనవరి 2: తెలంగాణ ఏర్పాటు కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం బసంతాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తెలంగాణ అమరవీరుడు ఇషాంత్‌రెడ్డిని గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాటం చేసిన ఉద్యమకారుల సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తుందని చెప్పారు. అమరవీరుల కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ఆత్మార్పణం చేసుకున్న ఇషాంత్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని, వారికి 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామని తెలిపారు.

మాది ప్రజా ప్రభుత్వం

తమది ప్రజా ప్రభుత్వమని, ప్రజల సమస్యలను తెలుసుకుని అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సౌకర్యం కోసం అధికార యంత్రాంగం ప్రజల చెంతకే వచ్చి ధరఖాస్తులు తీసుకుంటున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్‌ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచడం ఇప్పటికే అమలు చేస్తున్నామని తెలిపారు. మిగిలిన పథకాలకు అర్హులైన ప్రతీ ఒక్కరు ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ధరఖాస్తులు చేసుకున్నవారికి మంత్రి చేతుల మీదుగా రసీదులను అందజేశారు. అనంతరం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలనె అమలను చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శరత్, మాజీమంత్రి చంద్రశేఖర్, సురేష్‌కుమార్ షెట్కార్, మండల పార్టీ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి బాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సిద్దిలింగయ్యస్వామి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు మహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.


బసంతాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

కొత్త ఆశలు..

నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభంపై ప్రభుత్వ సానుకూలత

- ఇటీవల శాసన మండలిలో ప్రస్తావించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సీఎం హామీపై కార్మికుల హర్షం
- ఘన చరిత్ర కలిగిన చక్కెర కర్మాగారం
- మెదక్‌లో 1988లో ఏర్పాటు
- 2002లో ప్రైవేటీకరణ
- క్రమంగా నష్టాల ఊబిలోకి
- స్వరాష్ట్రంలోనూ మారని తీరు
- 2015లో మూసేసిన సర్కారు
- కొత్త ప్రభుత్వంపై గంపెడాశలు


శిథిలమవుతున్న ఉద్యోగుల నివాసాలు

మెదక్, జనవరి 2 : మూతబడ్డ నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి శాసనమండలి సభలో ప్రకటించడంతో కార్మిక కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలో చెరకు పంటకు వెన్నుదన్నుగా నిలువడంతో పాటు ఎంతోమందికి ఉపాధి కల్పించిన నిజాం చక్కెర కర్మాగారాలు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా క్రమంగా మూతపడ్డాయి. కార్మికులు రోడ్డునపడ్డారు. ప్రైవేటు ఫ్యాక్టరీల ఆగడాలు భరించలేక రైతులు చెరకు పంట వేయడం తగ్గించేశారు. ప్రస్తుతం సీఎం హామీతో మరోసారి నిజాం షుగర్స్‌పై ఆశలు చిగురిస్తున్నాయి.

మెదక్‌లో ఎన్ఎస్ఎఫ్ ప్రస్థానం

1988లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జిల్లాకు చెందిన మంత్రి కరణం రాంచందర్‌రావు చొరవతో మెదక్ జిల్లా కేంద్రానికి సమీపంలోని మంబోజిపల్లిలో నిజాం షుగర్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ప్రారంభించారు. చుట్టుపక్కల 12 మండలాల రైతులు తాము పండించిన చెరుకును ఈ ఫ్యాక్టరీలో గానుగ ఆడించేందుకు తీసుకువచ్చేవారు. వందల సంఖ్యలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి లభించింది.

ప్రైవేటీకరణ నేపథ్యం

ప్రభుత్వం రంగంలో పనిచేస్తున్న నిజాం ఫ్యాక్టరీలు భారీ నష్టాలను చవిచూస్తున్నాయని 2002లో ప్రైవేటీకరణకు పూనుకున్నారు. ప్రభుత్వ వాటాగా 49 శాతం ఉంచుకుని 51 శాతం వాటాతో పారిశ్రామికవేత్త గోకరాజు గంగరాజును భాగస్వామిగా చేర్చుకుని ప్రైవేటు యాజమాన్యం కింద ఫ్యాక్టరీలను నడిపారు. క్రమంగా పరిశ్రమ తన శోభను కోల్పోవడం ప్రారంభమైంది. 2004లో జరిగిన అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన శాసనమండలి కమిటీ నిజాం షుగర్స్ కర్మాగారాలను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని నివేదిక అందజేసింది. కానీ తదనంతరం జరిగిన పరిణామాలతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. 2014లో జరిగిన తెలంగాణ తొలి ఎన్నికల సందర్భంగా టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లో నిజాం షుగర్స్‌ను స్వాధీనం చేసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.

వీధిన పడిన ఉద్యోగులు

తెలంగాణలో తొలిసారి ఏర్పడిన టీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో నిజాం షుగర్స్‌ను ప్రభుత్వ హయాంలో నడిపిస్తామని ప్రకటించింది. మూడేళ్లుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులు ఆందోళనలు చేస్తున్నారు. కార్మికుల ఆశలు చిగురిస్తున్న సమయంలోనే 2015 డిసెంబరు 23వ తేదీ అర్ధరాత్రి నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాలను లేఆఫ్ ప్రకటిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి వీధినపడ్డారు. దీంతో బోధన్‌లోని షక్కర్‌నగర్ యూనిట్, కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి, మెదక్ మంబోజిపల్లి కర్మాగారాల కార్మికులు, రైతులు ఫ్యాక్టరీలను ఏకపక్షంగా మూసేశారని ఉద్యమించారు. ఆందోళనలతో దిగివచ్చిన కార్మిక సంక్షేమశాఖ అధికారులు కార్మికులతో చర్చలు జరిపారు. చర్చల నివేదికను ప్రభుత్వానికి సమర్పించగా.. కేసును 2017 ఆగస్టులో లేబర్ కోర్టుకు అప్పగించి లే-ఆఫ్‌పై విచారణ ప్రారంభించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో సెప్టెంబరులో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. నిజాం షుగర్స్ లిక్విడేషన్‌కు ట్రిబ్యునల్ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ అప్పటి ప్రభుత్వం ఢిల్లీ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. అక్కడ విచారణ కొనసాగుతోంది.

ఎనిమిదేళ్ల క్రితమే హామీ

ప్రస్తుత ముఖ్యమంత్రి, నాటి తెలుగుదేశం నేత రేవంత్‌రెడ్డి ఎనిమిదేళ్ల క్రితం మెదక్ మంబోజిపల్లిలో నిజాం షుగర్స్ కర్మాగారం ఎదుట కార్మికుల ఆందోళనలో పాల్గొని మద్దతు తెలిపారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని అప్పటి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎనిమిది సంవత్సరాల సుదీర్ఘ విరామం అనంతరం ఆయన సీఎం కావడంతో నిజాం షుగర్స్‌పై ఆశలు చిగురించాయి. తాజాగా అసెంబ్లీలో ప్రకటనతో పరిశ్రమకు మంచి రోజులు వస్తాయని ఆశిస్తున్నారు.

ఇథనాల్ ఉత్పత్తికి ప్రోత్సాహకాలు

చక్కెర తయారీ ప్రక్రియలో బైప్రొడక్ట్‌గా ఈథైల్ ఆల్కహాల్ వస్తుంది. కేంద్ర ప్రభుత్వం రాబోయే రోజుల్లో పెట్రోల్‌లో 20 శాతం మేర ఇథనాల్‌ను కలపాలని నిర్ణయించింది. ఇథనాల్ ఉత్పత్తి చేసే సంస్థలకు ప్రోత్సాహకాలు కూడా అందజేస్తోంది. దీంతో చక్కెర పరిశ్రమలు, ఇతర వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల పరిశ్రమల్లో ఉత్పత్తయ్యే ఇథనాల్‌కు డిమాండ్ ఉంది. ప్రస్తుతం సరిపడా ఇథనాల్ ఉత్పత్తి లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దిగుమతి చేసుకునే బదులు ఇక్కడి పరిశ్రమలనే తిరిగి ప్రారంభించాల్సిందిగా కార్మికులు కోరుతున్నారు.

పోరాటస్ఫూర్తిని చాటిన దుబ్బాక

- గత ఎన్నికల్లో జరిగిన తప్పిదానికి ఇక్కడి ప్రజలు వడ్డీతో సహా 54వేల మెజార్టీ ఇచ్చారు
- మాయమాటలతో ఒక్కసారే మోసం చేయగలరు
- దుబ్బాక ప్రజల రుణం తీర్చుకోలేనిది
- పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలవాలి
- కృతజ్ఞత సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు

దుబ్బాక, జనవరి 2: తెలంగాణ ఉద్యమంలో అరెస్టులు, పోరాటాలు జరిగాయంటే దుబ్బాకనే... పోరాటాల పురిటిగడ్డ దుబ్బాక, ఆ స్ఫూర్తిని నిలబెట్టుకుందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. దుబ్బాక ప్రజలు గత ఎన్నికల్లో జరిగిన తప్పిదానికి వడ్డీతో సహా 54వేల మెజార్టీతో గులాబీ జెండాను ఎగురవేశారని తెలిపారు. మంగళవారం దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ, నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్‌రావు మాట్లాడారు. దుబ్బాక ప్రజల రుణం తీర్చుకోలేదని, మాట నిలబెట్టుకున్న ప్రజలకు జన్మజన్మలా రుణపడి ఉంటానని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో సిద్దిపేట కంటే ముందే దుబ్బాక నడిచేదన్నారు. తనకు వెన్నుగా నడిచిన దుబ్బాక ఉప ఎన్నికల్లో పరిస్థితి తనను చాలాకాలం బాధపెట్టిందన్నారు. ఈ ఎన్నికల్లో వడ్డీతో సహా తిరిగి ఇచ్చారని, దుబ్బాక గులాబీ కంచుకోట అని మరోసారి నిరూపించారన్నారు. ప్రభాకర్‌రెడ్డిపై కత్తిపోటు జరిగిన తర్వాత పరామర్శించడానికి వెళ్తే తాను ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పాడన్నారు. తాను సముదాయించి సిద్దిపేట నుంచి వచ్చిన కార్యకర్తలు, దుబ్బాక ప్రజలు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేస్తామని నచ్చజెప్పానన్నారు. ప్రతీ కార్యకర్త కసితో పనిచేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కార్యకర్తల కార్యదీక్షతోనే దుబ్బాకలో భారీ మెజార్టీ సాధించగలిగామని స్పష్టం చేశారు. మాయమాటలు, మోసపూరిత హామీలు ఎల్లకాలం సాగవని ఇక్కడి ప్రజలు నిరూపించారని హరీశ్‌రావు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వం రాకున్నా, కార్యకర్తలు బాధపడవద్దన్నారు. ప్రస్తుతం మనకు స్పీడ్ బ్రేకర్ మాత్రమేనన్నారు. తప్పులు జరిగితే సవరించుకుని ముందుకు సాగుతామని, కార్యకర్తలు అధైర్యపడొద్దన్నారు. ఇదేమి బీఆర్ఎస్‌కు కొత్తకాదన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని కాని ఇప్పటి వరకు ఏదీ నెరవేరలేదన్నారు. మాటనిలబెట్టుకోని కాంగ్రెస్‌ను, తెలంగాణ ప్రయోజనాలే పట్టని బీజేపీని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోగా ఆరు గ్యారంటీలను అమలు చేయకుంటే తగిన బుద్ధి చెప్పాలని హరీశ్‌రావు కోరారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కలిసికట్టుగా నిలబడి, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు వివరించాలన్నారు. వీధుల్లో, పండుగల్లో, ఫంక్షన్లలో చర్చపెట్టాలని సూచించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడే పార్టీ కేవలం బీఆర్ఎస్ మాత్రమే అని ప్రజలకు వివరించాలన్నారు. భవిష్యత్తు మనదేనని, అంతిమ విజయం కూడా మనదేనన్నారు. మరో ఆరు నెలల తర్వాత ప్రజలు మన మంచితనం గుర్తిస్తారని చెప్పారు. ఇప్పటికే కొద్దికొద్దిగా అర్థం అవుతుందని, మరో ఆరు నెలల్లో మొత్తం బయటపడుతుందని ఆయన పేర్కొన్నారు. - తెలంగాణ ప్రయోజనాలు ఢిల్లీలో వినిపించే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని, వచ్చే పార్లమెంట్ ఎన్నికలల్లో ఎక్కువ స్థానాలను గెలిచి తీరాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, నాయకులు ఆర్, రాజమౌళి, వెంకటనర్సింహారెడ్డి, కత్తికార్తికా గౌడ్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామకమిటి అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాక సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

5లోగా మల్లన్న కల్యాణ ఏర్పాట్లు పూర్తవ్వాలి

- సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్
- క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనుల్లో జాప్యంపై ఆగ్రహం


తోటబావి ప్రాంగణంలోని కల్యాణవేదిక వద్ద తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

చేర్యాల, జనవరి 2: కొమురవెల్లి మల్లన్న కల్యాణ ఏర్పాట్లన్నీ ఈనెల 5వ తేదీలోగా పూర్తిచేయాలని, అయా పనుల్లో నిర్లక్ష్యం వహించకూడదని సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని సందర్శించి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రభుత్వశాఖల వారీగా తీసుకోవాల్సిన ఏర్పాట్లు, చర్యలపై సూచనలు చేశారు. కల్యాణం జరిగే ఆలయ తోట బావి ప్రాంగణం, దర్శన క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలతో ఆలయ పరిసరాలు, 50 గదుల సత్రం, భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ సమీపంలోని పీహెచ్‌సీని పరిశీలించి వైద్యసేవల నిర్వహణపై సూచనలు చేశారు. అదనంగా వైద్యులు, సిబ్బందిని ఏర్పాటుచేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో కాశీనాథ్‌కు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, కల్యాణ వేదిక వద్ద భక్తుల తోపులాట నెలకొనకుండా పటిష్ఠ బందోబస్తు చేపట్టాలని సూచించారు. వీఐపీ, వీవీఐపీలకు సంబంధించిన పాసులను సమన్వయంతో పంపిణీ చేయాలన్నారు. 24గంటల పాటు విద్యుత్ సౌకర్యం ఉండేలా చూడాలని సూచించారు. భక్తులకు వైద్యసేవల నిర్వహణకు ప్రత్యేక క్యాంపు ఏర్పాటుచేయాలన్నారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మిషన్‌భగీరథ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈనెల 5న తాను మళ్లీవచ్చే సరికి ఏ పని కూడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ఆలయ పరిసరాలలో చెత్తా,చెదారం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని, పారిశుధ్య కార్మికులు డ్రెస్‌కోడ్ పాటించాలని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచే యాలని, అన్నిశాఖల అధికారులు, మొబైల్ నంబర్లతో సహా జాబితా రూపొందించాలని తెలిపారు.

తాత్కాలిక క్యూలైన్ల సంఖ్యను పెంచాలి

రూ.11కోట్ల వ్యయంతో ఆలయ ప్రాంగణంలో చేపట్టిన క్యూకాంప్లెక్స్ భవన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో కలెక్టర్ పాటిల్ అసహనం వ్యక్తంచేశారు. ఈవిషయమై కాంట్రాక్టర్ రాములును తనవద్దకు పిలవాలని ఈవో బాలాజీని ఆదేశించారు. తాత్కాలిక క్యూలైన్ల సంఖ్యను పెంచాలని, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. 50 గదుల సత్రం భవనం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని పంచాయత్‌రాజ్‌శాఖ అధికారులను ఆదేశించారు.

బెల్ట్‌షాపులను మూయించాలి

ఆలయ పరిసరాలతో పాటు చుట్టుపక్కల మద్యం విక్రయించే బెల్టుషాపులను వెంటనే మూసేయించేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ మూర్తిని కలెక్టర్ ఆదేశించారు. భక్తుల మనోభావాలకు భంగం కలగకుండా బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పాటుపడాలని తెలిపారు. కలెక్టర్ వెంట అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రావు, జడ్పీటీసీ సిలివేరు సిద్ధప్ప, డీఎంఅండ్‌హెచ్‌వో కాశీనాథ్, ఏసీపీ సతీశ్, తదితరులు ఉన్నారు.

గొల్ల కురుమల సంప్రదాయం ప్రకారం కల్యాణం జరిపించాలి

పంజాగుట్ట, జనవరి 2 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాన్ని గొల్ల కురుమల బండారు(పసుపు) సంప్రదాయం ప్రకారం జరిపించాలని తెలంగాణ గొల్ల కురుమ సంఘం, ఓయూ విద్యార్థి నాయకుడు కురుమ శ్రీశైలం డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఓయూ జేఏసీ నాయకుడు ఎం.చంద్రశేఖర్ యాదవ్, సంతోష్‌యాదవ్, ప్రసాద్ యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తమ తాత, ముత్తాతల కాలం నుంచి వంశపారంపర్యంగా వచ్చే బండారు(పసుపు)సంప్రదాయం ప్రకారం మల్లన్న కల్యాణాన్ని నిర్వహించే వారన్నారు. 30 సంవత్సరాలుగా ఆగమశాస్త్రం అని చెప్పి విభూతితో పూజలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ ప్రభుత్వంలో అయినా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. అలాగే ఆలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.



హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కురమ శ్రీశైలం

చలికాలం.. జీవాలు పైలం


పచ్చిక మేస్తున్న గొర్రెలు, మేకలు (ఫైల్)

చిన్నకోడూరు, జనవరి 2: రోజు రోజుకు పెరుగుతున్న చలితో ప్రజలతో పాటు జీవాలూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అయితే చలి వల్ల మేకలు, గొర్రెల్లో పలు రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఈ సమయంలో పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారిణి మంజుల సూచిస్తున్నారు.

జలుబు, దగ్గు

జీవాలకు జలుబు, దగ్గు సోకినప్పుడు తుమ్ములు, కళ్లు, ముక్కు నుంచి నీరు కారుతుంది. చీమిడి పసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. జీవాల పాక ఇరుకుగా ఉండటం, గాలి సరైన వెలుతురు లేక, అదేవిధంగా తడి, తేమ ఎక్కువగా ఉండటం, కాలుష్యం, దుమ్ము వాతావరణంలో ఆకస్మాత్తుగా వచ్చే మార్పులు వీటికి కారణమవుతాయి. క్రిముల ద్వారా సోకే అంటువ్యాధులతో ఆహారం ద్వారా శ్వాస కోశంలోకి వచ్చే కణాలు జలుబు, దగ్గుకు కారణమవుతాయి. వీటి నివారణకు పాకలోకి గాలి, వెలుతురు సరిగా వచ్చే విధంగా చూడాలి. వాతావరణం అనుకూలంగా లేనప్పుడు జీవాలను బయటకు వదలకూడదు. పాకను శుభ్రంగా ఉంచుకోవాలి.

షీప్ ఫాక్స్

షీప్‌ఫాక్స్ ఇది గొర్రెలకు మాత్రమే వచ్చే వ్యాధి. ఈ వ్యాధి సోకిన జీవాలకు చర్మంపై దద్దుర్లు వస్తాయి. జ్వరం తీవ్రంగా ఉండటం, మేత మేయకపోవడం ఈ వ్యాధి లక్షణాలు.

పెంపకందారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

- మంజుల, మండల పశువైద్యాధికారి, చిన్నకోడూరు



చలికాలం జీవాల విషయంలో పెంపకందారులు ఎక్కువగా శ్రద్ధ వహించాలి. జీవాలు చలికి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏమైనా వ్యాధులు సోకితే సొంత వైద్యం చేయకుండా పశు వైద్యాధికారులను సంప్రదించాలి.

నెట్‌బాల్ పోటీల్లో గజ్వేల్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపక బృందం

గజ్వేల్‌టౌన్, జనవరి 2: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో గజ్వేల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ గోపి తెలిపారు. గత డిసెంబర్ 30 నుంచి జనవరి 1 వరకు నల్గొండ జిల్లాలో జరిగిన జూనియర్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్, ఫాస్ట్ (5)నెట్‌బాల్ పోటీల్లో గజ్వేల్ మోడల్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులు శ్రీవాణి, సరిత, రసజ్ఞ ప్రతిభ చాటినట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండు కాంస్య పతకాలు గెలుపొందారని పేర్కొన్నారు. క్రీడాకారులను కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

ఆరు గ్యారంటీలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి



చిన్నకోడూరు మండలం ఓబులాపూర్‌లో దరఖాస్తును పరిశీలిస్తున్న సిద్దిపేట ఆర్డీవో రమేష్ బాబు



తొగుట: ఘనపూర్‌లో వృద్ధురాలి నుంచి దరఖాస్తును స్వీకరిస్తున్న ఎంపీపీ లతా నరేందర్ రెడ్డి



కొండపాక: తిమ్మారెడ్డిపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవీ రవీందర్



హుస్నాబాద్ 17వ వార్డులో మహిళ నుంచి దరఖాస్తును స్వీకరిస్తున్న వార్డు కౌన్సిలర్ రాజు

సెలవుల కారణంగా రెండు రోజుల విరామం అనంతరం ప్రజాపాలన కార్యక్రమం మంగళవారం జిల్లావ్యాప్తంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి స్థానిక సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అభయహస్తం పేరిట రాష్ట్రప్రభుత్వం అమలు చేయ తలపెట్టిన ఆరుగ్యారంటీలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిన్నకోడూరు, జనవరి 2: మండలంలోని చెల్కలపల్లి, ఎల్లాయిపల్లి, గోనెపల్లి, ఓబులాపూర్ గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి అధికారులు ప్రజాపాలన సదస్సులు నిర్వహించి, ఆరు గ్యారంటీల దరఖాస్తులను స్వీకరించారు. గోనెపల్లి, చెల్కలపల్లి, ఎల్లాయిపల్లి, గ్రామాలను జడ్పీ సీఈవో రమేష్, ఓబులాపూర్ గ్రామాన్ని సిద్దిపేట ఆర్డీవో రమేష్ బాబు సందర్శించి, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీవో సోమిరెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● **తొగుట:** మండలంలోని ఘనపూర్ గ్రామంలో ఎంపీపీ లతా నరేందర్ రెడ్డి తహసీల్దార్ శ్రీకాంత్‌తో కలిసి ప్రజా పాలన దరఖాస్తులను లబ్ధిదారుల నుంచి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ, ఎంపీటీసీ శరత్, ఆర్ఐ అశోక్ రాజ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, టీపీసీసీ ఫిషర్మెన్ రేపాక తిరుపతి ఉన్నారు.

● **మిరుదొడ్డి:** అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లిలో రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎంపీడీవో రాజిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఉమారాణిబాలాగౌడ్, ఉపసర్పంచు ప్రభాకర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

● **గజ్వేల్ రూరల్:** గజ్వేల్ మండలంలోని శ్రీగిరిపల్లి, దాచారంలో గ్రామాల్లో ఎంపీడీవో మచ్చింద్ర, బూర్గుపల్లి, అనందరావుపల్లిలో గ్రామాల్లో తహసీల్దార్ బాలరాజు 2 టీమ్‌లుగా ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కొక్క టీమ్‌లో 10 మంది ఆయా శాఖల అధికారులతో కలిసి అర్హులైన వారినుంచి అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి సునీత, ఆయా శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

● **కొండపాక:** మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, సిరసనగండ్ల కుకునూరుపల్లి మండలం లకుడారం మాత్‌పల్లి గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తిమ్మారెడ్డిపల్లి, లకుడారం గ్రామాల్లో ఎంపీటీసీల ఫోరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ పాల్గొని మాట్లాడారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అలాగే ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో స్పెషల్ ఆఫీసర్లు అమీనా బేగం, నాగేందర్ తహసీల్దార్లు మల్లికార్జున్, శ్రీనివాస్, ఎంపీడీవో రాంరెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

● **జగదేవ్‌పూర్:** మర్కుక్ మండలంలోని నర్సన్నపేట, పాములపర్తి తదితర గ్రామాల్లో జడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, ఎంపీపీ పాండుగౌడ్ కలిసి ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో ప్రవీణ్, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వార్డు సభల్లో మంగళవారం 884 దరఖాస్తులు వచ్చాయి. పట్టణంలోని 20 వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించగా ఇప్పటి వరకు మొత్తం 5048 దరఖాస్తులు వచ్చాయి. ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● **అక్కన్నపేట:** మండలంలోని గుడాటిపల్లి, కట్కూర్, దుబ్బతండా, చాపగానితండా గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో తహసీల్దార్ సంజీవ్ కుమార్, ఎంపీడీవో కొప్పుల సత్యపాల్‌రెడ్డి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమాల్లో సర్పంచులు బద్దం రాజిరెడ్డి, జిల్లెల అశోక్‌రెడ్డి, మాలోతు రాజునాయక్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

● ములుగు: గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలను అందించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ములుగు మండల కేంద్రంలో సర్పంచ్ బట్టు మమత అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన కార్యాక్రమంలో ప్రజల నుంచి అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. అదేవిధంగా కొత్తూర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ బాలేష్ ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, వార్డు సభ్యులు రాజు, నాయకులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే ఫొటో లేకుండానే ప్రజాపాలనా?

● **అధికారులను నిలదీసిన బూర్గుపల్లి సర్పంచ్**

గజ్వేల్, జనవరి 2: స్థానిక ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటో లేకుండా ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించడమేంటని గజ్వేల్ మండలం బూర్గుపల్లి గ్రామ సర్పంచ్ వంటేరు విజయ్‌వర్ధన్‌రెడ్డి అధికారులను నిలదీశారు. బూర్గుపల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ వద్ద నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రొటోకాల్ విస్మరించి ఫెక్సీలను వేయడాన్ని తప్పుబట్టారు. సీఎం, మంత్రుల ఫొటోలు ఉన్నప్పుడు స్థానిక ఎమ్మెల్యే ఫొటో ఎందుకు లేదని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల పేరిట ప్రొటోకాల్ విస్మరించడం సరికాదని విమర్శించారు.



గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ విజయ్‌వర్ధన్‌రెడ్డి

బైరాన్‌పల్లిలో అక్రమంగా ఇసుక తరలింపు



ట్రాక్టర్‌పై ఇసుక తరలిస్తున్న దృశ్యం

మద్దూరు, జనవరి 2: దూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో కొందరు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. గ్రామాభివృద్ధి కోసం చేపడుతున్న పనుల పేరిట రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో ఏదైనా అభివృద్ధి పనులు చేపడితే గ్రామపంచాయతీ పర్మిషన్‌తోనే ఇసుక తరలింపు ఉంటుంది. అయితే ప్రస్తుతం గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ఎవరికి పర్మిషన్ ఇవ్వలేదని సమాచారం. మంగళవారం పలువురు ట్రాక్టర్ యాజమానులు గ్రామంలో యథేచ్ఛగా ఇసుకను తరలించినా సంబంధిత రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీకి ఎలాంటి సంబంధం లేదని సెక్రటరీ తెలపడం గమనార్హం.

అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మద్దూరు, జనవరి 2 : నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేసి వారి సమస్యల్ని పరిష్కరించేందుకు చొరవ చూపాలని జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం దూళిమిట్ట మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల కోకన్వీనర్ సుద్దాల భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన మండల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇస్తున్న ఆరు గ్యారంటీల ఫలాలు అసంఘటిత రంగ కార్మికులకు అందే విధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా మండల సీఐటీయూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కో కన్వీనర్‌గా సుద్దాల భాస్కర్, కమిటీ సభ్యులుగా మల్లయ్య, సిద్దులు, సత్యనారాయణ, ప్రసాద్, గట్టయ్య, వీరయ్య, కనకయ్య, రాజు, చందర్, యాదయ్య, బాలనర్సయ్య, సంపత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

భక్తి భావాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలి



మిరుదొడ్డిలో భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న మాధవానంద సరస్వతీ

మిరుదొడ్డి, జనవరి 2: ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి పేర్కొన్నారు. మంగళవారం మిరుదొడ్డిలో భగవద్గీత సాముహిక పారాయణ కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవన్నామస్మరణ చేయడం ద్వారా మనలో ఉన్నచెడు గుణాలు తొలగి, మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పురోహితులు రాజపున్నయ్యశర్మ, భక్తులు తదితరులున్నారు.

పార్టీ లైన్ దాటొద్దు.. అవిశ్వాసాన్ని విరమించుకోవాలి

● చేర్యాల బీఆర్ఎస్ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భేటీ ● ఆవేదన వెళ్లగక్కిన అసంతృప్త కౌన్సిలర్లు

చేర్యాల, జనవరి 2 : చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాస ప్రక్రియను విరమించుకోవాలని, పార్టీలైన్ ఏమాత్రం దాటవద్దని, కాంగ్రెస్ వలలోపడి మోసపోకూడదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అసంతృప్త బీఆర్ఎస్ కౌన్సిలర్లకు సూచించారు. మంగళవారం చేర్యాలలో ఏడుగురు మున్సిపల్ బీఆర్ఎస్ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఒక్కో అసంతృప్త కౌన్సిలర్‌తో మాట్లాడి వ్యక్తిగత అభిప్రాయం తెలుసుకున్నారు. ప్రస్తుతం పార్టీ కష్టకాలంలో ఉందని, పార్టీ పరువుకు భంగం కలిగించేలా అవిశ్వాసానికి ఒడిగట్టవద్దని, అందరి భవిష్యత్తుకు తాను తప్పకుండా సహకరిస్తానని సూచించారు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోకూడదని, బూటకపు హామీలతో భంగపడవద్దని తెలిపారు. కానీ అసంతృప్త కౌన్సిలర్లలో ఒకరిద్దరు పల్లా సూచనలతో విభేదించారు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు రెండు కూడా రెడ్డి సామాజిక వర్గానికే కట్టబెట్టారని, బీసీ, ఎస్సీలకు ప్రాధాన్యం లేనందున తమకు అవకాశం కల్పించాలని సూచించారు. తమకు గతంలో ఇచ్చిన హామీప్రకారం చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించాలని జుబేదా కాటూన్ కోరగా, ఉద్యమ నాయకుడిగా ఎన్నోకేసుల పాలైనా పార్టీనుండి ఆదరణ పొందలేదని మంగోలు చంటి వాపోయినట్టు సమాచారం. బీసీలకు అవకాశం కల్పించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఆడెపు నరేందర్ కోరినట్లు తెలిసింది. ఇరువురిని పదవులనుంచి మార్చి తమ సామాజికవర్గానికి అవకాశం కల్పించాలని, లేదా అవిశ్వాసాన్ని విరమించుకోబోమని స్పష్టంచేసినట్లు సమాచారం. భేటీలో పరస్పర భిన్నవాదనలు చోటుచేసుకున్న నేపథ్యంలో అవిశ్వాసంపై సందిగ్ధం వీడకపోవడం ఆసక్తిని రేపుతున్నది.



బీఆర్ఎస్వీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన పల్లా

చేర్యాల, జనవరి 2 : చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ ఆధ్వర్యంలో ప్రచురింపచేసిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సాధనలో బీఆర్ఎస్వీ, విద్యార్థుల పాత్ర ఎనలేదనిదన్నారు. బీఆర్ఎస్వీ పటిష్టతకు పాటుపడాలని సూచించారు.



జిల్లా న్యాయాధికారికి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు

జిల్లా న్యాయాధికారిని కలిసిన బార్ అసోసియేషన్

హుస్నాబాద్, జనవరి 2: కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం సిద్దిపేటలో జిల్లా న్యాయాధికారి రఘురాం, జిల్లా అదనపు న్యాయాధికారి రవికుమార్, సబ్ జడ్జి వినోద్ కాంబ్లీలను హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, న్యాయవాదులు చిత్తారి హన్మయ్య, కొత్తపల్లి దేవేందర్, బాకం సంపత్, మురళీమోహన్ తదితరులు వెంట ఉన్నారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు కమలాయపల్లి విద్యార్థిని



వజ్రోజు లిఖిత

చేర్యాల, జనవరి 2: మండలంలోని కమలాయపల్లి గ్రామానికి చెందిన వజ్రోజు లిఖిత ఈ నెల 26న ఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకలకు ఎంపికైంది. హైదరాబాద్ కోఠి తెలంగాణ మహిళా యూనివర్సిటీలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువున్న లిఖిత ఎన్ఎస్ఎస్ సభ్యురాలిగా పనిచేస్తున్నది. ఇటీవల ఏపీలోని విజయవాడలో నిర్వహించిన శిబిరంలో ప్రతిభ కనబరచడంతో ఢిల్లీ గణతంత్ర వేడుకలకు తెలంగాణ రాష్ట్రం నుంచి లిఖితతో సహా ఎనిమిదిమందిని ఎంపిక చేశారు. గణతంత్ర వేడుకలలో పాల్గొన్న అనంతరం రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాని నరేంద్రమోదీని కలవనున్నారు.

ఘనంగా కొమ్మూరి జన్మదిన వేడుకలు



కస్తూర్బాలో కొమ్మూరి బర్త్‌డేను నిర్వహిస్తున్న జడ్పీఫ్లోర్ లీడర్

మద్దూరు, జనవరి 2: జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలను జడ్పీ ఫ్లోర్ లీడర్ గిరి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థినులకు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బండి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్, సర్పంచ్ బాలరాజ్, ఎంపీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు కామిడి జీవన్‌రెడ్డి, జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, మఠం భద్రయ్య, ఊట్ల శ్రీధర్‌రెడ్డి, ఎండీ ఫసి, పీవీ కరుణాకర్‌రెడ్డి, బత్తిని కనకయ్య, మ్యాక మల్లేశం, గంగాధర్, రామడుగు బాల్‌రాజ్, షౌకత్‌అలీ, దాసరి పద్దారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్
నూతన కార్యవర్గాన్ని అభినందించిన హరీశ్‌రావు



తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ లోగోను ప్రారంభిస్తున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట క్రైం, జనవరి 2: ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ లోగోను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల హైదరాబాద్ పీఆర్టీయూ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు కనక చంద్రం, రాష్ట్ర ప్రచార కార్యదర్శి, పరాంకుశం నాగేందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి నంట శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గిరిరవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరిపల్లి నగేష్, ఆర్థిక కార్యదర్శి దుబ్బాక రాజు, మహిళా కార్యదర్శి జ్యోతి, తదితరులకు మాజీమంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర , జిల్లా కార్యవర్గం హరీశ్‌రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సహా అధ్యక్షులు గంగాధర్, భరత్, ఉపాధ్యక్షుడు భీమ్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ రాష్ట్రంలో రెండో స్థానం సాధించిన సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం కలిశారు. ఈ సందర్భంగా వారికీ శుభాకాంక్షలు తెలిపి అభినదించారు. అనంతరం అయోధ్య శ్రీరాముడి అక్షింతలను ప్రతినిధులు హరీశ్‌రావుకు అందజేశారు.

శుభాకాంక్షలు తెలిపిన వివిధ సంఘాల ప్రతినిధులు

సిద్దిపేట క్రైం, జనవరి 2: సిద్దిపేట జిల్లా జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు రంగాచారి ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంగళవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సిద్దిపేట నర్సింగ్ కళాశాల అధ్యాపక బృందం, రేషన్ డీలర్స్ అసోసియేషన్, పార్టీ యువత, విద్యార్థి విభాగం నేతలు, వివిధ జిల్లాల నుంచి వచ్చి పలువురు హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గట్లమల్యాల గ్రామస్థుల క్యాలెండర్‌ను మాజీమంత్రి ఆవిష్కరించారు.

● **గజ్వేల్:** గజ్వేల్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిశారు. సిద్దిపేట పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఆయనవెంట నాయకులు కూరాకుల సాయి, కొమురవెల్లి సంపత్‌కుమార్ ఉన్నారు.

కోనాయపల్లి చెరువులోకి మురుగుకాల్వ నీరు

● **పట్టించుకోని అధికారులు**

నంగునూరు, జనవరి 2 : వృథాగా పోతున్న పంచాయతీ బోరు నీటిని మురుగు కాల్వ ద్వారా చెరువులో నింపడం విడ్డూరంగా ఉందని పలువురు ఆక్షేపిస్తున్నారు. ఈ తంతు మండలంలోని కోనాయిపల్లి గ్రామంలో జరుగుతుండగా సంబంధిత శాఖ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. కోనాయిపల్లి గ్రామప్రజల అవసరార్థం స్థానిక బస్టాండ్ వద్ద బోరును వేసి దాని ద్వారా నీటిని అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ బోరుకు 24 గంటలు ఉచిత కరెంటు సైతం వాడుతున్నారు. కరెంటు ఉన్నంతసేపు ఈ బోరు నీళ్లు పోస్తూనే ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. మిషన్ భగీరథ నీరు రానప్పుడు మాత్రమే గ్రామస్థులు ఈ బోరు నీటిని పట్టుకుంటారు. అయితే పైప్ లైన్ సక్రమంగా వేయకపోవడంతో నీరు వృథాగా పోతున్నది. సంబంధిత అధికారులు పైప్‌లైన్ పనులు చేపట్టే బదులు ఆ వృథా నీటిని మురుగు కాలువ ద్వారా స్థానిక చెరువులోకి మళ్లించారు. ఇదేంటని ప్రశ్నిస్తే స్థానిక చెరువును నింపేందుకు ఈ బోరు నీరు ఉపయోగపడుతుందని గ్రామస్థులు చెబుతున్నారు. ఎన్నో గ్రామాల్లో తాగు నీటి కొరత ఎదుర్కొంటుండగా, కొనాయపల్లిలో మాత్రం మురుగు కాలువ ద్వారా చెరువును నింపడం విడ్డూరంగా ఉందని ఆ దారిన వెళ్లేవారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు బోరు మోటర్ ను ప్రజల అవసరాల కోసం వినియోగించేలా కృషి చేయాలని కోరుతున్నారు.

బస్ టికెట్‌లో మక్తమాసాన్‌పల్లి పేరును చేర్చండి

గజ్వేల్, జనవరి 2: బస్ టికెట్‌లో మక్తమాసాన్‌పల్లి గ్రామం పేరును చేర్చాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ బి.సురేఖకు గ్రామస్థులు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శాతం స్వామి, చిట్యాల రవిందర్, ఇసుకంటి స్వామి, జాలిగామ నాగరాజులు మంగళవారం ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. మక్తమాసాన్‌పల్లి గ్రామపంచాయతీగా ఏర్పాటై నాలుగేళ్లు దాటుతున్నా ఇప్పటి వరకు టికెట్‌లో బంగ్లావెంకటాపూర్ గ్రామంగా పేరు వస్తుందన్నారు.

గ్రామ మస్కూరీలుగా ఓటాబందిని అమలు చేయాలి



ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన టీజేఎస్ అధ్యక్షుడు నిరుడిస్వామి

గజ్వేల్, జనవరి 2: గ్రామ మస్కూరీలుగా ఓటాబందీని అమలు చేయాలని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు నిరుడిస్వామి పేర్కొన్నారు. తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో టీజేఏసీ జిల్లా చైర్మన్, న్యాయవాది బాపురావు, తెలంగాణ జనసమితి జిల్లా కో కన్వీనర్ అందె ప్రవీణ్, సీనియర్ జర్నలిస్టు కిరణ్‌కుమార్‌లతో కలసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లాలోని రాజకీయ పరిస్థితులను గూర్చి చర్చించారు. అనంతరం గత ఎన్నికలకు ముందు గ్రామాల్లో మస్కూరిగా పనిచేస్తున్న వారి కుటుంబాల పొట్టగొట్టి ఓటాబంది విధానం రద్దు చేస్తూ గత ప్రభుత్వం తీసుకున్న అక్రమ జీవోలను హైకోర్టు తప్పుబట్టినా ఇస్సాదారులను కాదని ఒకరిని నియమించడం మూలంగా రాష్ట్రంలో మిగతా ఇస్సాదారులైన నాలుగు లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగిందని కోదండరాం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఇస్సాదారులకు తగిన న్యాయం చేయాలని కోదండరాంను కోరారు. పాత ఓటాబంది విధానం కొనసాగేలా, అన్ని కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తానని కోదండరాం తెలిపినట్లు స్వామి పేర్కొన్నారు.

రిటైర్డ్ హోంగార్డును సన్మానించిన ఏఆర్ అడిషనల్ డీసీపీ

సిద్దిపేట క్రైం, జనవరి 2: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వరమ్మ ఉద్యోగ విరమణ చేయడంతో మంగళవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న హోంగార్డు ఆఫీసులో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, డ్రైవర్ నరేందర్‌రెడ్డి, మహిళా హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ హోంగార్డు రాజేశ్వరమ్మను సన్మానిస్తున్న ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్

పలు మండలాల్లో అయోధ్య అక్షింతల కలశాలతో శోభాయాత్ర



గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అయోధ్య అక్షింతలను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు



చిన్నకోడూరు: అక్షింతల కలశాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు



మర్కుక్‌లో భజన చేస్తూ ఇంటింటికీ అయోధ్య అక్షింతలను వితరణ చేస్తున్న భక్తులు

గజ్వేల్, జనవరి 2: అయోధ్య రామమందిర అక్షింతల కలశాల శోభాయాత్రను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గజ్వేల్ నుంచి ప్రజ్ఞాపూర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీగా వెళ్లిన భక్తులు ఇంటింటికీ అయోధ్య అక్షింతలు, జెండాలను అందజేశారు. ఊరేగింపులో భక్తుల భజనలు, నృత్యాలతో వీధుల్లో సందడి నెలకొన్నది. కాగా అక్షింతల కలశాలను మహిళలు మంగళహారతులతో స్వాగతించారు.

● **బెజ్జంకి:** అయోధ్య శ్రీరాముని అక్షింతల కలశాలు మండలంలోని దాచారం గ్రామానికి మంగళవారం చేరుకున్నాయి. ఈ సందర్భంగా అక్షింతల కలశాలను భక్తులు శ్రీరామ నామ సంకీర్తన చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామంలోని రామాలయంలో అయోధ్య అక్షింతలకు పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ కుటుంబానికి అయోధ్య అక్షింతలను అందించనున్నట్లు భక్తమండలి కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ కొలిపాక రాజు, నితీన్‌రావు, దీటి రాజు, వేణు, రాము, రామ్ నారాయణ, లక్ష్మణ్, శ్రీశైలం, చరణ్, భక్తులు పాల్గొన్నారు.

● **చిన్నకోడూరు:** చిన్నకోడూరు మండల కేంద్రంలో మంగళవారం అయోధ్య రాముని అక్షింతల వితరణను ప్రారంభించారు. గ్రామంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి అక్షింతల కలశాన్ని మేళ తాళాలతో, శ్రీరామ నామ సంకీర్తన చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి పలు కులసంఘాలకు అక్షింతలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

● **జగదేవ్‌పూర్:** మర్కూక్ మండలంలో అయోధ్య అక్షింతల వితరణ కార్యక్రమం పండుగలా కొనసాగింది. మంగళవారం మండలంలోని గంగాపూర్, మర్కూక్ తదితర గ్రామాల్లో హనుమాన్ యువజన సంఘం సభ్యులు, శ్రీరామ నామ భజన సంకీర్తనలతో ప్రతీ ఇంటికి అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతల వితరణ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రమేష్‌గుప్తా, హనుమాన్ సభ్యులు బాల్‌రాజు, పాండు, అనంతరామ్, శంకర్‌సింగ్, శ్రీనివాస్‌గుప్తా, ఎగొండ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణలు



నర్మెటలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో దేశిరెడ్డి

నంగునూరు, జనవరి 2: విద్యారంగ సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి పేర్కొన్నారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను నర్మెటలో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల శాఖ అధ్యక్షుడు పయ్యావుల జైపాల్ యాదవ్, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు గడీల శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి కత్తుల రామిరెడ్డి, మన్మోహన్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి ,కల్లాటి శ్రీనివాస్, బొజ్జ చంద్రకాంత్, వెంకటేష్, నరేందర్, రాములు ,లక్ష్మి నర్సయ్యతదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో..



క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్

బెజ్జంకి, జనవరి 2: పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో సర్పంచ్ ద్యావనపల్లి మంజుల ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు మచ్చ శేఖర్, టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్య ప్రకాష్, మల్లేశం, రవీందర్, శ్రీపతి, మల్లేశం, చంద్రప్రకాష్, రాజు, పద్మశాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.